న్యూస్‌రీల్

ప్రజావాణికి స్పందన కరువు



భీమారంలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

భీమారం/చెన్నూర్‌రూరల్: మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. అధికారులు హాజరైనా ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు, ప్రజలు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భీమారంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో కె.శ్రీనివాస్, ఎంపీవో సతీష్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, చెన్నూర్‌లో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఏవో కవిత, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుట్టను పరిరక్షించాలని కలెక్టర్‌కు వినతి

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామంలో గల గుట్టను పరిరక్షించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కొంతమంది కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలు నామమాత్రంగా చెల్లిస్తూ గుట్ట నుంచి అక్రమంగా బండరాయి, మొరం తరలిస్తున్నారని దీనిని వెంటనే అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుట్ట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కూడా కలెక్టర్‌కు విన్నవించారు.

నేడు బస్తీ దవాఖానా ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం బస్తీ దవాఖానాను ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని రైల్వే రడగంబాల బస్తీలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. బస్తీ వాసులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఓటరు దినోత్సవంపై పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో సోమవారం జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా హాజీపూర్, నస్పూర్, మంచిర్యాల మండలాల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో పోచయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమన్వయ కార్యకర్తగా యోగేశ్వర్ వ్యవహరించగా ఎమ్మార్పీ బాధ్యులు నాగేంద్రబాబు, గురవయ్య, అంజద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌పోటీల్లో ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: డిసెంబర్ 4న ఆన్‌లైన్‌లో నిర్వహించిన నేషనల్ లెవల్ లిటిల్ జీనియస్ ఓపెన్ అబాకస్ పోటీల్లో స్థానిక ఉషోదయ పాఠశాలకు చెందిన సయ్యద్ అసర్ అనే విద్యార్థి ప్రతిభ కనబరిచారు. వంద మార్కులకు గాను 95శాతం మార్కులు(స్కోర్) చేయటంతో ప్రశంసాపత్రం అందజేశారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసర్‌కు పాఠశాల కరస్పాండెంట్ బాలాజీ ప్రశంసాపత్రం అందజేయటంతో పాటు అభినందించారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు మార్గదర్శకాలు విడుదల చేసేటప్పుడు పలు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి అన్నారు. జీవో317 బాధితుల జీరో సర్వీసు బదిలీలకు అర్హతగా పరిగణించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల తప్పనిసరి బదిలీలకు ఐదు సంవత్సరాల సర్వీసును, ఎస్జీటీ, ఎస్సీల ఎనిమిది సంత్సరాల సర్వీసును లెక్కలోకి తీసుకోవాలని సూచించారు. బదిలీల కంటే ముందుగా బ్లాక్ చేసిన జిల్లాలకు స్పౌజ్‌లను బదిలీలు చేయాలన్నారు.

రికార్డులు తనిఖీ



తనిఖీ చేస్తున్న మధుసూదన్‌నాయక్

నస్పూర్: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో వంటగదిని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ శ్రద్ధగా చదుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సర్టిఫికేట్లు జారీ చేయడంలో జాప్యం చేయొద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, పాఠశాల ఎస్ఓ మౌనిక, ఆర్ఐ మాంతయ్య పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినోదం.. వికాసం

- విహారయాత్రలతో విద్యార్థులకు ప్రయోజనం



వెయ్యిస్తంభాల గుడి వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: ప్రతిరోజు బడికి వెళ్తూ తరగతుల్లో విన్న పాఠ్యాంశాలతో పాటు గుర్తుండిపోయే ప్రాంతాలను ప్రత్యక్షంగా చూసి విద్యార్థులు తరించిపోయారు. తెలంగాణ ప్రత్యేకత తెలుసుకుంటూ పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు విహారయాత్ర చేస్తూ వినోదంతో పాటు విజ్ఞానాన్ని పొందారు. కరోనా ప్రభావానికి ముందు పలు ప్రాంతాల సందర్శనలు అవసరమని ప్రభుత్వమే ఒక్కో పాఠశాలకు రూ.8,400 కేటాయించింది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు తోచినంతగా నిధులు సమకూర్చుకున్నారు. రెండు రోజుల క్రితం రెండు బస్సుల్లో 130మంది కలిసి రామప్ప, వెయ్యిస్తంభాల గుడి, లక్నవరం, భద్రకాళి ఆలయం ప్రాజెక్టులను సందర్శించారు. లక్నవరం చెరువును చూడటంతో పాటు బోటింగ్ చేశారు. పలు ప్రదేశాలకు తీసుకెళ్లి ఉపాధ్యాయులు ఆయా ప్రాంత విశేషాలను విద్యార్థులకు వివరించారు. విహారయాత్రకు వెళ్లిన విద్యార్థులను 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి..

కొత్త విషయాలు తెలుసుకున్నా...



పాఠశాల నుంచి విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లటంతో నాకు ఇదివరకు తెలియని కొత్త విషయాలు తెలుసుకున్నా. ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రకాళి, రామప్పతో పాటు లక్నవరం సందర్శించాం. చెరువులో బోటింగ్ చేయటం అనేది మరుపురాని అనుభూతి.

\- కార్తీక, విద్యార్థిని

ఎన్నో విషయాలపై..



పాఠ్యపుస్తకాలలో చదవటమే గాని ఇంత వరకు ప్రత్యక్షంగా చూడలేదు. ఇప్పుడు విహారయాత్రకు వెళ్లటంతో చారిత్రాత్మక కట్టడమైన రామప్ప, ఓరుగల్లు వెయ్యి స్థంభాల ఆలయం చూసే అవకాశం కలిగింది. పర్యాటక ప్రదేశాల సందర్శన ద్వారా ఎన్నో విషయాలు తెలిశాయి. భద్రకాళి టెంపుల్, ఇతర ప్రదేశాలను చూడటం వల్ల అవగాహన ఏర్పడింది.

\- శ్రీ తేజస్వినీ, విద్యార్థిని

ఎంతో ప్రయోజనం..

విజ్ఞానయాత్రలతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. నిత్యం పాఠశాలలో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు కొత్త ప్రదేశాలు సందర్శించటం ద్వారా తెలియని కొత్త విషయాలెన్నింటినో తెలుసుకున్నారు. మేధో వికాసానికి కూడా విజ్ఞానయాత్ర దోహదపడుతుంది.

\- శారద, ప్రధానోపాధ్యాయురాలు

'కంటి వెలుగు' శిబిరం సందర్శన



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య



శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో నరేందర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సోమవారం సందర్శించారు. మున్సిపాలిటీలోని 1వార్డు కన్నాల బస్తీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 18వార్డు పరిధి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మాట్లాడి కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అభయమిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయపూర్ణిమ, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారి భుజంగరావు, కౌన్సిలర్ సూరం సంగీత, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకటేష్, మున్సిపల్, మెప్మా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం కంటి పరీక్షలు నిర్వహించాలి

నెన్నెల(భీమిని): గ్రామాల్లో వందశాతం కంటి పరీక్షలు నిర్వహించాలని, అందరికీ సేవలందేలా చూడాలని జెడ్పీసీఈవో నరేందర్ సూచించారు. కన్నెపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. 18సంవత్సరాలు పై బడిన వారందరినీ స్క్రీనింగ్ చేసుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. రోగుల నమోదుతో పాటు పరీక్షల ఏర్పాట్లను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో రాధాకిషన్ ఉన్నారు.

గొర్రెల పెంపకం షెడ్ పరిశీలన



లక్ష్మీపూర్‌లో గొర్రెల షెడ్‌ను పరిశీలిస్తున్న రమేశ్

లక్సెట్టిపేట: గొర్రెలను పెంచేందుకు షెడ్ చుట్టూ గడ్డిని పెంచాలని జిల్లా పశువైద్యాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఇటీవల నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన గొర్రెల పెంపకం షెడ్‌ను సోమవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గొర్రెలను పెంచేందుకు షెడ్ చుట్టూ గడ్డిని పెంచాలని, వాటికి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధి నిరోదక టీకాలు అందించాలని, జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్వేత, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



మంచిర్యాలటౌన్: నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

బెల్లంపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత నేతాజీ సుభాష్‌బోస్ జయంతి వేడుకలు సోమవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ ప్రైవేట్ పాఠశాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి, సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పాఠశాల కరస్పాండెంట్ వంగల చక్రపాణి, హెడ్‌మాస్టర్ ఉమారాణి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

తాండూర్: మండలంలోని బోయపల్లి బోర్డు వేణునగర్‌లో ఉన్న సేవాజ్యోతి శరణాలయంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. శరణాలయం నిర్వాహకురాలు గజ్జెల్లి శ్రీదేవి సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సేవాజ్యోతి శరణాలయం సభ్యులు స్వప్న, కృష్ణ, శివతేజ శ్యామ్ శంకరం, లక్ష్మి, మతిస్థిమితం లేని మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక నారాయణ పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని జరుపుకున్నారు. పట్టణంలోని 40పాఠశాలలు, ఐదు జూనియర్ కళాశాలలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం, భారతీయ సంస్కృతి సురక్షసంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భాస్కర్ బాల్నే, కన్వీనర్ మల్యాల రవిశేఖర్, వెలుగు ఫౌండేషన్ బాధ్యులు రాంప్రకాశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వో టూ జీఎం కృష్ణారావు హాజరై సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్ యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కోశాధికారి పడాల రవీందర్, బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి వి.మధుసూదన్ రెడ్డి, సభ్యులు సత్యపాల్ రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ సభ్యులు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను బార్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావ్, సీనియర్ న్యాయవాదులు చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డేగ రవీందర్, ఉపాధ్యక్షుడు భుజంగ్‌రావ్, సీనియర్ న్యాయవాదులు చుంచు సదానందం, కొత్త సత్తయ్య, మురళి, ఆకుల రవీందర్ పాల్గొన్నారు.



తాండూర్: పూలమాల వేస్తున్న శ్రీదేవి



బెల్లంపల్లి: నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు



మందమర్రిరూరల్: మాట్లాడుతున్న ఎస్వో టూ జీఎం

'హెల్మెట్ పేరిట అధికారుల వేధింపులు'



మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: విధులకు ద్విచక్రవాహనాలపై వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా ఇంటి వద్ద నుంచే హెల్మెట్ ధరించి రావాలని గని అధికారులు ఉద్యోగులను వేధిస్తున్నారని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, హెచ్ఎమ్మెస్ ఏరియా ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి ఆరోపించారు. ఏరియాలోని కేకే-1, వర్క్‌షాపులలో సత్యనారాయణ, ఏరియాలోని కేకే-5 గనిపై హెచ్ఎమ్మెస్ ఏరియా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి కార్మికులతో మాట్లాడారు. హెల్మెట్ ధరించే విషయం చూసుకోవడానికి సంబంధిత శాఖ అధికారులు ఉన్నారని, సింగరేణి అధికారులు ఎందుకు రాద్దాంతం చేస్తున్నారని ప్రశ్నించారు.

బొగ్గుబాయి వార్తలు

బహుమతులు ప్రదానం

శ్రీరాంపూర్: బొగ్గు నాణ్యత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు సోమవారం ఏరియా జీఎం సంజీవరెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. జీఎం కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాసరచన పోటీల్లో గాజ కుమారస్వామి(ప్రథమ), నామిశ్ల దినేశ్(ద్వితీయ)స్థానం, సందేశాత్మక నినాదంలో చందా ప్రవీణ్(ప్రథమ స్థానం, మార్త హరికృష్ణ(ద్వితీయ స్థానం), కన్సోలేషన్ బహుమతుల్లో శీలోజు అంజనేయ చారీలకు అందించారు. ఇలాంటి పోటీల వల్ల ఉద్యోగుల్లో ఉన్న టాలెంట్ బయటికి వస్తుందని జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం త్యాగరాజు, డీజీఎం(పర్సనల్) పీ.అరవిందరావు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్కే 5గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న నిరంజన్‌గుప్తా

నెన్నెల(భీమిని): బాలికలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భీమిని మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో బాలికలకు హక్కులపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ ఆనంద్, కస్తూరిబా ఎస్ఓ కవిత, సర్పంచ్‌లు ఎల్లాగౌడ్, భూమయ్య, కో ఆప్షన్ సభ్యుడు హరీఫ్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా దినోత్సవం

మంచిర్యాలటౌన్: జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాంనగర్ సెక్టార్‌లోని ముస్లింబస్తీ2 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కిషోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచన దేవి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, 18ఏళ్ల నిండే వరకు అమ్మాయిలకు వివాహాలు చేయొద్దని, చదువుతోనే అమ్మాయిలు అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ హఫీజ బేగం, అంగన్‌వాడీ టీచర్లు పి.కాంతకృష్ణ, ఎం.లావణ్య పాల్గొన్నారు.

నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దుర్గం రాజేష్



పాతమంచిర్యాల: పాతమంచిర్యాలకు చెందిన దుర్గం రాజేష్‌ను నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు నేతకాని సంఘం సమన్వయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖనిలో సోమవారం నేతకాని సమన్వయకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా ప్రొఫెసర్ జాడి మురళీధర్, దుర్గం నర్సయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

దాడులను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట్రంలో బహుజనులు, హేతువాదులు, నాస్తికులు ప్రజాస్వామిక వాదులపై మతోన్మాద మూకలు చేస్తున్న దాడిని అరికట్టాలని స్వేచ్ఛ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం మానవహారంగా ఏర్పడి నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కోటగిరిలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయున్ని పాఠశాల నుంచి ఊరేగింపుగా తీసికెళ్లి అవమానపరిచిన ఘటనలో నిందితులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వేచ్ఛ జేఏసీ నాయకులు పలిగిరి కనకరాజు, రంగు రాజేశం, దేవి పోచన్న, డూర్కె మోహన్, దుర్గం రామ్మూర్తి, ఎడ్ల కిష్టయ్య, రెడ్డిమల్ల ప్రకాశం, గోమాస రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా



మంచిర్యాలఅగ్రికల్చర్: పెండింగ్ కోడిగుడ్ల బిల్లులు, పెరిగిన వేతనాల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రబియా, లక్ష్మి రవళి, కరీమా, కళావతి, భాగ్య, సునీత, పద్మ, మంగమ్మ, మానస, తిరుపతి మద్దతుగా సంకె రవి సీపీఎం జిల్లా కార్యదర్శి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

పాతమంచిర్యాల: రజకుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2500కోట్ల బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో సోమవారం రజక వృత్తిదారుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు.

'భగీరథ' నీరంతా వృధా

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారి వెడల్పు పనులు నిర్వహిస్తుండగా, జేసీబీతో మట్టి తీసేప్పుడు 'మిషన్ భగీరథ' పైపు పగిలింది. దీంతో సుందరయ్య కాలనీ, జ్యోతినగర్, తీగల్‌పహడ్, అల్లూరి సీతారామమ రాజు నగర్, లక్ష్మినగర్ తదితర కాలనీలకు సరఫరా నిలిచింది. ఈ విషయమై గ్రిడ్ ఏఈ వినయ్‌ని సంప్రదించగా మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్

కాసిపేట: ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయల మధ్య సోమవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. నాలుగు జట్లలో ప్రెస్ జట్టు మొదటి స్థానం సాధించగా ఉపసర్పంచ్‌ల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. గెలుపొందిన జట్టుకు అధికారులు, ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు.

నలుగురిపై పిచ్చికుక్కల దాడి

భీమారం: భీమారంలోని పలు కాలనీలకు చెందిన నలుగురిపై పిచ్చికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని కుక్కల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పశువులకు ర్యాబిస్ నిరోధక టీకాలు

భీమారం: మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్యాధికారి రాకేష్ శర్మ పశువులకు ర్యాబిస్ నిరోదక టీకాలు వేశారు.రైతులకు సూచనలు ఇచ్చారు.

'ప్రజలకు సేవలందించడంలో ఎంతో తృప్తి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: ప్రజలకు ఉచితంగా సేవలు అందించడంలో ఎంతో తృప్తి కలుగుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. స్థానిక హన్మాన్ మందిర్‌లో సోమవారం మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో అంగవైకల్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చిన్నయ్య రిబ్బన్‌కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో కొంత కాలం నుంచి ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారన్నారు. వారి సేవలు ఎంతో గొప్పవని ప్రశంసించారు. ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మార్వాడీ యువమంచ్ నిర్వాహకులకు తనవంతు సహకారం అందిస్తానని ముున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పుర ప్రజలు ఏళ్ల తరబడి నుంచి ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాలను త్వరలోనే అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు, మున్సిపాలిటీ వ్యాప్తంగా 7000ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మార్వాడీ యువమంచ్ పట్టణ అధ్యక్షుడు అజయ్‌కుమార్ లోయ మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులను దివ్యాంగులకు అందిస్తున్నామన్నారు. శిబిరం ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్ రాజలింగు, మార్వాడీ యువమంచ్ పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్ సోని, ఉపాధ్యక్షుడు బాలప్రసాద్ మారు, నిర్వాహకులు అరవింద్ అగర్వాల్, మనీష్‌మారు, రాజేష్‌కార్వా, మహేశ్వరి సమాజ్ ప్రతినిధులు బాలప్రసాద్ సోని, తేజ్‌ప్రకాష్ అగర్వాల్, ఘన్ శ్యామ్ లోయ, ద్వారకా ప్రసాద్ సార్డా తదితరులు పాల్గొన్నారు.